# గుండెలు మార్చబడును

జంధ్యాల

## ఎపిసోడ్ - 1

డాక్టర్ మధు హాస్పిటల్లో "ఇచ్చట గుండెలు మార్చబడును" అని బోర్డు తగిలిస్తుండగా వాళ్ళ మామయ్య గోవిందయ్యకి తాను ఏడుగురికి గుండెమార్పిడి ఆపరేషన్లు చేశానని అందులో ఆరుగురు మహాభేషుగ్గా ఉన్నారని చెపుతాడు. గోవిందయ్య తనకి వాంతులవుతున్నాయి అని చెబుతుండగా పెద్దదొరకి విరేచనం కాలేదని మందియ్యమని మల్లువస్తాడు. మందు తీసుకెడతాడు.

హాయిగా దగ్గు పడిశానికి మందులిచ్చుకో ఈ గుండెమార్పిళ్లు చెయ్యడం ఏమీ బాగుండలేదని ఓ సలహా చెప్పి గోవిందయ్య వెళ్లబోతుండగా రామచంద్రమూర్తి ఒయ్యారంగా హొయలు వలకబోస్తూ వస్తాడు. మధు రామచంద్రమూర్తిగారూ, అని పిలిస్తే అయ్యో నేను రమనండీ నిన్న గుండె ఆపరేషన్ జరిగిన దగ్గర్నించీ చాలా హాయిగా ఉందని చెప్తాడు.

మళ్లీ మల్లు వచ్చి విరేచనం కాలేదని మందు తీసుకెడతాడు. రామచంద్రమూర్తి తన పేరు రమ అని చెప్పిందగ్గర్నించీ గోవిందయ్య రమ తనకే సొంతం అన్నట్టుగా ప్రవర్తిస్తూంటాడు.

కుక్కుటేశ్వర్రావు అనే ఓ 50 ఏళ్ళ వ్యక్తి పాక్కుంటూ, డేక్కుంటూ చిన్న పిల్లవాడి చేష్టలు చేస్తూ ఉంటే రమ (రామచంద్రం) ఆ పిల్లవాణ్ణి సముదాయిస్తుంది. అది గోవిందయ్యకి నచ్చదు.

ఓ చిన్న పిల్లవాడి గుండె ఈ పెద్దాయనకి పెట్టి ఆపరేషన్ చేసినట్టుగా గుర్తొస్తుంది మధుకి. కంగారు పడతాడు. కుక్కుటేశ్వరరావు ఏడుస్తుంటే మళ్ళీ మీ గుండె తెచ్చి మీకు ఆపరేషన్ చేస్తాను ఊరుకోమంటాడు.

గోవిందయ్య గల ఎక్కువైపోతుంది. తానో నవయువకుడిలా రమాదేవితో సరసాలు, ముద్దుమాటలు ఎక్కువైతే అసలే చికాగ్గా ఉన్న మధు విసుక్కుంటాడు.

మళ్ళీ మల్లు దొర విరేచనం మందుకోసం వస్తే మధు కిరసనాయిలు తీసుకొచ్చి మల్లుకిచ్చి మొత్తం తాగెయ్యమను మీదొరని అని చెప్తాడు.

పిల్లాడిని లోపల ఆడిస్తానని రమ కుక్కుటేశ్వర్రావుని తీసుకుని లోపలకెడుతుంటే గోవిందయ్య కూడా వాళ్లతో వెడతాడు.

నరసింహమూర్తి అనే ఆయన వచ్చి తన భార్య రమ అన్నీ మగాడి వేషాలు వేస్తోందనీ, సిగరెట్టుతాగడం, ఆడపిల్లల వంక చూడ్డం గడ్డం, చేసుకోడంలాంటివి చేస్తోందని, నా పాంటూ చొక్కా వేసుకుని తయారయిందని ఏడ్చినంత పనిచేస్తాడు.

నరసింహమూర్తి విరుచుకుపడిపోతాడు. లోపల్నించి రమ వస్తూనే పడిపోయిఉన్న నరసింహమూర్తిని తన ఒళ్లోకి తీసుకుని నా భర్తని బతికించండి డాక్టరుగారూ అని ఏడుస్తుంది. వెనగ్గా వచ్చిన గోవిందయ్యకి ఈయన నాభర్త అని చెపుతుంది. విషయం తెలిసిన గోవిందయ్య పరాయి వాడి భార్య నాకు చెల్లెలులాంటిదంటాడు.

నరసింహమూర్తి రామచంద్రమూర్తిని చూసి నువ్వు నా భార్యవేమిటీ అని కేకవేస్తాడు. మధు ఆ పొరపాటు తనవల్లే జరిగిందని, సరిచేసేస్తాను అంటాడు. రేపు సాయంకాలం లోపల ఏమైనా సరే మా ఆవిడ గుండె మా ఆవిడకి పెట్టకపోతేనా అని నరసింహమూర్తి బెదిరిస్తుంటే కోటేశ్వర్రావు అనే ధనికుడు గుడ్డివాడిలా అడుక్కుంటూ వస్తాడు. గోవిందయ్య నరసింహమూర్తి ఆ కోటేశ్వరుడు అలా అడుక్కోడం చూసి, నరసింహమూర్తి అడిగిన మీదట మధు ఆయనకి కూడా ఆపరేషన్ చేశానని చెపుతాడు.

తగుదునమ్మా అని ప్రతి వ్యవహారానికీ తయారవకూడదు అని మందలిస్తాడు నరసింహమూర్తి. రామచంద్రమూర్తి ఏవండీ అంటూ రమ లాగే నరసింహమూర్తి వెంట బడుతుంది.

నరసింహమూర్తి వెంట రమ వెడుతుంటే చూసి ఈ కుక్కుటేశ్వర్రావుని కూడా ఇంట్లో దింపమని రమ అడుగుతుంది. దాంతో విసుక్కున్న నరసింహమూర్తి మా పక్కింటి దేవయ్యగారి అబ్బాయికి ఆపరేషన్ చేస్తే వాడేమో రెండేళ్లవాడే అయినా బూతు మాటలు మాట్లాడుతూ, చుట్ట కాలుస్తూన్నాట్ట. కాసేపాగితే నీ మీదకి రాగలడు జాగ్రత్త అని చెప్పి నరసింహమూర్తి వెళ్ళిపోతాడు.

నిన్న ఆపరేషన్‌కి ముందు ట్రేలో పెట్టిన గుండెలన్నీ తారుమారు అయిఉండాలి అందుకే ఇంత విపరీతం జరిగిందని గోవిందయ్యతో చెప్పుకుని వాపోతాడు డాక్టర్ మధు.

మల్లు వచ్చి పెద్దదొర విరేచనం, దొరలేడు అని చెప్పి వెళ్ళిపోతాడు. మధు తన వాంతులకిచ్చిన మాత్ర తిరిగి ఇచ్చేస్తాడు గోవిందయ్య. గుండె ఆపరేషన్లు మెదడు ఆపరేషన్లూ లాంటి వాటి జోలికి పోకు అంటూ సలహా ఇచ్చి వెళ్ళబోతూ వెనక్కివచ్చి -

నరసింహమూర్తిగారు చెప్పిన దేవయ్యగారి మనుషులమనుకుంటా వస్తున్నార్రోయ్ అంటూ చెపుతాడు.

మధు గుండెలు మార్చబడును అన్న బోర్డులో ఉన్న 'గుండెలు' అన్న మాటని "గుండీలు" గా మార్చేస్తాడు.